# రూపా రూపాలు

నేను బస్సు స్టాండులో అడుగుపెట్టేసరికి విజయవాడ-గుంటూరు నాన్‌స్టాప్ బస్సు రెడీగా వుంది. రెండు అడుగులు వేగంగా వేసి బస్సు ఎక్కాను. గుమ్మంలో అడ్డంగా నుంచున్న ఒకతను "టిక్కెట్టు బుక్కింగ్‌లో తీసుకోవాలండీ" అన్నాడు.

నేను అతనికేసి చూశాను. ఆ చూపులో నిరసన మెరిసే వుంటుంది. కారణం - నా జేబులో వున్న వారంటు. నేను ఆర్. టి. సి. ఉద్యోగిని.

"స్టాఫ్" అన్నాను. అతనేమీ మాట్లాడలేదు. కిటికీ పక్కన సీటులో సర్దుకుని కూర్చున్నాను. జనం ఎక్కువగా లేకపోవడం వల్ల ఒక్కొక్కరే వచ్చి నచ్చినసీటు చూసుకుని కూర్చుంటున్నారు.

నేను సన్నగా పొట్టిగా వుండడంవల్ల చాలామంది నన్ను కుర్రాడనే అనుకుంటారు. వాళ్ళు అలా అనుకోవడం నాకేమీ బాధగా వుండదు. ఆనందంగానే వుంటుంది. నేను ఎకవుంటెంట్ హోదాలో వున్నాననిగాని, బలమైన యూనియన్‌కి పట్టుగొమ్మలాంటి వాడిననిగాని నన్నుచూసి ఎవ్వరూ అనుకోరు. మా ఆఫీసరు నన్ను 'బోయ్' అని వ్యవహరించినపుడు నాకెంతో ఆనందంగా వుంటుంది. ఆఫీసులో ప్రతివాడూ "పొట్టివాడికి పుట్టెడు బుద్ధులు" "పిట్టకొంచెం కూతఘనం" వగైరా మాటలతో ఎగతాళి చేస్తుంటే అది నా ప్రతిభకి గుర్తింపు అనిపిస్తుంది.

ఎవరేమన్నా నా పనేనా. మరోవిషయం పట్టించుకోను.

డ్రైవర్ ఎక్కాడు. ఎస్. ఆర్. తీసుకుని టిక్కెట్లు లెక్కపెట్టుకోవడం మొదలుపెట్టాడు.

అతన్ని చూసి నాకు గుండె ఝల్లుమంది. ఎందుకో భయమేసింది. నల్లగా - ఆరడుగుల ఎత్తుమనిషి - మూతిమీద మూరెడు గుబురు మీసం అతని ఆకారాన్ని మరింత భయంకరంగా చేస్తోంది. సినిమాల్లో మేకప్ చేసిన గూండాలా యెడం చెంపమీద కత్తిగాటు, నుదుటిమీద కుడివైపు నల్లనిమచ్చ.

అతని రూపంచూసి అతను కర్కోటకుడై వుండాలని నేను నిర్ణయించు కున్నాను.

బస్సులో ఎవరైనా టిక్కెట్టు తీసుకోవాలా అంటూ ఒక్క కేక పెట్టాడు. ఆ కంఠం కూడా కర్కశంగానే వుంది.

ఆలోచనల్లోపడి నేను "స్టాఫ్" అని, నా గగ్గర వారంటు వుందని చెప్పడం మర్చిపోయాను.

అతను లెక్కపెట్టడం మొదలుపెట్టాడు. పత్తికాయల్లాంటి అతని కళ్ళు వొక్కొక్క మనిషిమీంచీ అతివేగంగా దొర్లుతున్నాయి, ఆ చూపు నా దగ్గర ఆగింది. వెంటనే నేను "స్టాఫ్" అన్నాను.

"చంపారు పొండి. మరి చెప్పరేంటీ ..." అని "పాసుందా" అన్నాడు.

నాకెంతో అవమానం అన్పించింది. వెంటనే గర్వంగా "వారంట్" అన్నాను. అంతే! అతను ఒక్కుదుటున స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. అతని బరువుకి బస్సంతా వూగిందా! అనిపించింది. బస్సు స్టార్టుచెయ్యడం, సర్రున ముందున్న బస్సుని దాటించి అదేపనిగా హారన్ మోగించుకుంటూ దూసుకు పోవడం ఒకేసారి జరిగాయి. గేట్లోంచి రోడ్డుమీద కొచ్చి జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ వేగాన్ని పుంజుకుంది బస్సు.

ఆ వేగానికి నాలుగున్నరడుగుల ఎత్తూ, పీలగా, అర్భకంగావున్న నేను సీట్లో కూర్చోవడం కష్టమవుతూంది. నా పాదాలు పూర్తిగా క్రింద ఆనడంలేదు. బరువు తక్కువ కావడంవల్ల ఎటుపడితే అటు ఒరిగి పోతున్నాను. డ్రైవరుమీద ఎక్కడలేని కోపం, అశక్తతవల్ల చిరాకు, అహంకారం వల్ల కసి నాలో పొంగుకొచ్చాయి. బస్సు హైవే మీద

కొచ్చింది. రోడ్డుమీద వెళ్తోందో, గాలిలో తేల్తోందో తెలీడంలేదు. భయంతో గుండెలు దడదడ లాడుతున్నాయి. "ఈ రోజుతో భూమ్మీద నూకలు సరి" అనుకున్నా. ముందున్న ప్రతి వాహనం క్షణాలమీద వెనకబడుతోంది.

నలభై మంది ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆ నరరూప రాక్షసుణ్ణి చూస్తే నాకు వళ్ళు మండిపోయింది. ఏర్ హారన్‌తో చెవులు చిల్లులు పడుతున్నాయి. దానికితోడు బస్సు వేగానికి గాలివల్ల నాకు ఊపిరి సలపడంలేదు. నేనొక్కణ్ణే యిలా అనుకుంటున్నానా— అంతా యింతేనా? అని చుట్టూ చూశాను. మిగిలిన వాళ్ళందరూ హాయిగా కూర్చున్నారు. అప్పటికే కొందరు నిద్రల్లో జారుకున్నారు. బస్సుకు మించిన శబ్దంతో కొందరు మాట్లాడుకుంటున్నారు. లేడీస్‌సీట్లో కూర్చున్న ఒకమ్మాయి మాత్రం నాకేసే చూస్తోంది. ఆమె పెదవుల మీదనవ్వు నన్నుడికించింది.

డ్రైవరు మీద మరింత కసి పెరిగింది. నాకసి పెరుగుతున్నకొద్దీ బస్సువేగం పెరుగుతోందా అన్పించింది.

మంగళగిరి ఊళ్ళోకి వచ్చినపుడు తప్పనిసరై వేగం తగ్గింది. ఊరి పొలిమేరలో పంచాయితీవారి "నమస్తే" గ్రుదన తిరిగి మాయమయింది. మళ్ళీ మామూలే! అంతటి సామ్యవాద భావాలు కలవాణ్ణి ఒక్కసారి దేవుణ్ని స్మరించాను. ఈ బస్సు గుంటూరు చేరదు అని నిర్ధారణ చేసేసుకుని గట్టిగా కళ్ళు మూసుకున్నాను. వెనకనుంచి "అయ్యో" అంటూ అరిచారెవరో. బస్సు సడన్ బ్రేకుతో ఆగింది. నాతల యెదురుగా వున్న యినపకమ్మీకి కొట్టుకుంది. ప్రాణం జిల్లాడ్చుకు పోయింది. సన్నగా, తెల్లగా పిండిబొమ్మలాగున్న ఒకామె వాంతి చేసుకుంటోంది. "ఆమె పావుగంటనుంచీ బాధపడుతోంది" అన్నారెవరో.

నాకు భలే సంతోషం వేసింది. నలుగురూ కలిసి ఆ డ్రైవరు

అంత వేగంగా బస్సు నడుపుతున్నందుకు చీవాట్లు వేస్తారు - తగిన శాస్తి జరుగుతుంది అయినా అంత హెూగరేమిటీ అని సంబరపడటం మొదలు పెట్టాను.

కానీ, ఎవ్వరూ ఆ విషయం ఎత్తలేదు. డ్రైవరు వెనక్కొచ్చి "ఏమ్మా చెప్పకపోయావా, ఆపేవాణ్ణిగా?" అన్నాడు ఎంతో దయగా.

అప్పుడతని ముఖంలో నేనంతక్రితం వూహించిన కాఠిన్యంలేదు. అతని కళ్ళల్లో ఆ అర్భకురాలిమీద ఎంతో జాలి కనిపిస్తోంది. అతని గుబురు మీసాలూ, కత్తిగాటూ ఇవన్నీ అతని మనసులోంచి పొంగే కరుణకీ, ఆప్యాయతకీ అడ్డురాలేదు. నాకెంతో ఉక్రోషంగా అనిపించింది. "బస్సు అంత స్పీడుగా పోతే మామూలు వాళ్ళకే ప్రాణాలు ఎగిరిపోతున్నాయి" అన్నానుండబట్టలేక.

"బస్సు స్పీడుగా కాకపోతే చీమలా పోతుందా సార్" అన్నారెవరో.

"మరే మరే" అని అంతా తలలూపారు. నన్నెవరూ సమర్థించలేదు. ఆమె మెల్లగా బస్సుదిగింది. నేను కిటికీలోంచి తల బయటకుపెట్టి చూస్తున్నాను.

డ్రైవరెక్కణ్ణించో చెంబుతో నీళ్ళు పట్టుకొచ్చి ఆమె కిచ్చాడు. ఆమె ఆ నీళ్ళతో ముఖం కడుక్కొని కొంచెం తేరుకుని బస్సెక్కి మెల్లగా సీటులో జారగిలబడింది.

"రైట్" అన్నారెవరో డోర్‌మూస్తూ. బస్సు ఒక్కుదుటున కదిలింది. అరనిమిషంలో వేగాన్ని అందుకుంది.

గుండెధైర్యం లేని నేనుమాత్రం గట్టిగా కళ్ళు మూసుకుని కూర్చున్నాను.

●